క్లుప్తంగా

వైఎస్సార్‌ సీపీ విజయం ఖాయం


డాక్టర్‌ శ్రీనివాస్‌

రాజమహేంద్రవరం సిటీ: సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్‌ సీపీ విజయం ఖాయమని, వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని వైఎస్సార్‌ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్‌ గూడూరి శ్రీనివాస్‌ అన్నారు. ఆయన గురువారం మాట్లాడుతూ ఎన్నికలలో సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. జగన్‌ పాలనలో అభివృద్ధితో పాటు సంక్షేమ ఫలాలను అర్హులందరికీ అందాయని, ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు వచ్చి చేరాయన్నారు. వలంటీర్లు, సచివాలయాలతో ప్రజలకు అనేక సేవలు అందాయన్నారు. అందుకనే ప్రజలు జగన్‌ను రెండోసారి సీఎం చేసేందుకు సిద్ధమయ్యారన్నారు.


జూనియర్‌ కళాశాలలో ప్రవేశాలు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో ఇంటర్మీడియెట్‌ ప్రథమ సంవత్సరం ప్రవేశాలు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్‌ ఎన్‌ఎస్‌వీఎల్‌ నర్సింహం గురువారం తెలిపారు. కళాశాలలోని కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిని పూర్తి చేసి సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ప్రవేశాలు పొందవచ్చన్నారు. జనరల్‌ కోర్సులతో పాటు పది ఒకేషనల్‌ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు.

అన్నసమారాధన

కడియం: దుళ్లలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. భక్తుల సహకారంతో ప్రతి వారం ఆలయంలో అన్నదానం చేయడానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. బాబావారికి ఉదయం నుంచి ప్రత్యేక హారతులు, సంకీర్తనలు జరిగాయి. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో సాయి భక్త బృందం పాల్గొంది.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: బీఈడీ మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం రూపొందించిన భౌతిక రసాయన శాస్త్రం 1 పుస్తకాన్ని నన్నయ వర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్‌ ఆచార్య జి.సుధాకర్‌ గురువారం ఆవిష్కరించారు. నన్నయ అధ్యాపకుడు డాక్టర్‌ ఎం.గోపాలకృష్ణ దీనిని రచించారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం


బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం గ్రామానికి చెందిన గండికోట వెంకటేశులు కుటుంబానికి అండగా నిలుస్తామని ఎమ్మెల్యే, వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆయన గురువారం కాపవరంలోని బాధితుడి ఇంటికెళ్లి పరామర్శించారు. తక్షణ సాయం కింద నిత్యావసరాలు, నగదును అందజేశారు. ఇంటి నిర్మాణానికి హౌసింగ్‌ లోన్‌ అందజేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా ఎన్నికల చర్చే..

- ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ
- లెక్కలతో కుస్తీపడుతున్న నాయకులు
- గ్రామాలలో జోరుగా చర్చలు



కడియం: ఎన్నికల సమరం ముగిసింది. ఫలితాలు ఈవీఎంలలో నిక్షిప్తమయ్యాయి. గెలుపుపై ఎవరి అంచనాలు వారికి, ఎవరి ధీమాలు వారికి ఉన్నాయి. అయితే గ్రామాల్లో ఎన్నికల వేడిమాత్రం ఇంకా తగ్గలేదు. నలుగురు గుమిగూడిన చోట ఫలితాలు, మెజార్టీలపైనే జోరుగా చర్చసాగుతోంది. గ్రామాల్లో ఈ పరిస్థితి మరింత అధికంగా ఉంది. అధికార పార్టీకి ఎందుకు మెజార్టీ వస్తుంది, ఏ ఓటర్లు ఏ పార్టీకి మొగ్గుచూపుతున్నారన్న రచ్చబండ చర్చలు కొనసాగుతున్నాయి. అంతే కాకుండా సామాజికవర్గాల ప్రకారం ఎవరు, ఏ పార్టీ వైపు మొగ్గు చూపేందుకు అవకాశం ఉందన్న చర్చ కూడా నడుస్తోంది. పోల్‌ మేనేజ్‌మెంట్‌ ప్రభావం ఎంత, తమకు అనుకూలంగా ఉన్న అంశాలేంటి, గెలుపు ఏ విధంగా ఉండబోతోంది, ప్రత్యర్థికి బలహీనంగా మారిన పరిస్థితులు, తద్వారా గ్రామాల వారీగా మెజార్టీ వచ్చేందుకు ఏ పార్టీకి అవకాశం ఉందన్న లెక్కలు జోరుగానే వేస్తున్నారు. ఫంక్షన్లు, పెళ్లిళ్లు.. ఇలా సందర్భంగా ఏదైనా చర్చ మాత్రం ఎన్నికల ఫలితాల పైనే ఉంటోంది.

వివిధ అంశాలపై ఆరా..

గ్రామాల వారీగా తమవైపు నిలబడే ఓటర్ల లెక్కలను గ్రామ స్థాయి నాయకుల ద్వారా పోటీదారులు, వారి వర్గం వారు ఆరా తీస్తున్నారు. రాజకీయంగా చురుగ్గా ఉండే నాయకులకు స్థానికంగా లెక్కల మాట అటుంచితే, ఇతర ప్రాంతాల్లోని బంధువులు, స్నేహితుల నుంచి ఫోన్లు కూడా అధికంగా వస్తున్నాయి. తమ నియోజక వర్గాల్లో చర్చలకు తోడు ఉభయ గోదావరి జిల్లాలలో కీలకంగా నిలిచే స్థానాల్లో ఫలితం ఏంటన్న అంశం కూడా ఈ చర్చల్లో ప్రధాన భూమిక పోషిస్తోంది. ముఖ్యంగా అనపర్తి, కొత్తపేట, పిఠాపురం, రాజానగరం, నిడదవోలు తదితర నియోజకవర్గాల్లో ఫలితాలపై రచ్చబండ చర్చల్లో ప్రధానాంశంగా నిలుస్తున్నాయి. ఏది ఏమైనా ఫలితాలు వెలువడే వరకు ఈ చర్చలు కొనసాగుతూనే ఉంటాయన్నది ఒప్పుకోవాల్సిందే.

సోషల్‌ మీడియా గప్‌చుప్‌

రాజమహేంద్రవరం రూరల్‌: సాధారణంగా ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకర్షించడం కోసం వీధుల్లోని గోడలపై పోస్టర్లు అతికించే ఆనవాయితీ నుంచి డిజిటల్‌ వేదికల్లో వినూత్న పంథాలో ప్రచారం చేసేంతవరకు రూపాంతరం చెందింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొన్ని నెలలుగా జిల్లా అంతటా జోరుగా ప్రచారం సాగింది. సోమవారం ఎన్నికల ముగియడంతో ఒక్కసారిగా సోషల్‌ మీడియా మూగబోయింది. వాట్సాప్‌ మేసేజ్‌లు, అభ్యర్థుల బ్రాడ్‌ కాస్టింగ్‌ కాల్స్‌, ఇన్‌స్టా, రీల్స్‌, ఎక్స్‌పోస్టర్లతో దద్దరిల్లిన సోషల్‌ ప్రచారం గుప్‌చుప్‌ అయిపోయింది.

సోషల్‌ మీడియా కీలకపాత్ర

ఎన్నికల ప్రచారంలో ఈసారి సోషల్‌ మీడియా ప్రచారం కీలకపాత్ర పోషించింది. ఒకానొక క్రమంలో సినిమాలు, ప్రస్తుతం కొనసాగుతున్న ఐపీఎల్‌ క్రికెట్‌ మానియాను సైతం తలదన్నేలా డిజిటల్‌ ప్రచారం కొనసాగింది. ఒక్క పోస్ట్‌, ఒకే ఒక్క రీల్‌తో వేల మందిని ప్రభావితం చేసేలా అన్ని పార్టీలు దృష్టి సారించాయి. ఈ క్రమంలో కొన్ని రోజులుగా వాట్సాప్‌, ఫేస్‌బుక్‌, ఇన్‌స్టాగామ్‌, ఎక్స్‌ తదితర ఇంటర్నెట్‌ మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం సాగింది. వివిధ పార్టీలు, ఆయా అభ్యర్థులు ప్రైవేట్‌ పాటల ఆల్బమ్‌లను రూపొందించి వాటిని సోషల్‌ మీడియా ప్రచార అస్త్రాలుగా మార్చుకున్నారు. భౌతికంగా నిర్వహించే ప్రచార కార్యక్రమాలను సోషల్‌ మీడియాలో ప్రసారం చేశారు. ఈ ప్రచారం కోసం కొన్ని పార్టీలు ప్రత్యేకంగా టెక్నికల్‌ టీములను సైతం నియమించుకోవడం విశేషం. ఇదే అదనుగా కొందరు అవాస్తవాలను, దుష్ప్రచారాలకు తెర లేపారు. వ్యూస్‌ కోసం, వైరల్‌ కావడం కోసం అవసరమైన సమాచారాన్ని ప్రచారం చేసిన సంఘటనలూ లేకపోలేదు. ఏదైమైనా పోలింగ్‌ ముగియడంతో సోషల్‌ మీడియాలో పోస్టులు తగ్గిపోయాయి. అక్కడక్కడా ఆయా పార్టీల శ్రేణులు లెక్కలు అంచనాలతో పోస్టులు పెడుతూ కాలక్షేపం చేస్తున్నారు.

ఓటుకు దుమ్మా!

రూరల్‌ నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును పలువురు సద్వినియోగం చేసుకోలేదు. గత ఎన్నికల కంటే ఈసారి పోలింగ్‌ శాతం ఎక్కువగా నమోదైనప్పటికీ నియోజకవర్గంలో 73,636 మంది ఓటర్లు ఓటు వేయలేదు. వాస్తవానికి, ఓటు హక్కు ప్రాధాన్యతపై జిల్లా యంత్రాంగం విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. ఓటు విలువను ప్రజలకు తెలియజేసింది. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

మహిళా ఓటర్లే అధికం

నియోజకవర్గంలో 2,72,826 మంది ఓటర్లకు గాను 1,99,220 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 73,636 మంది ఓటుకు డుమ్మా కొట్టారు. ఇందులో మహిళలు 37,880 మంది, పురుషులు 35,741 మంది ఉన్నారు. వేయలేకపోయారు.

మ్యాన్‌ హోల్‌తో తరచూ అవస్థలు


తరచూ దెబ్బతింటున్న సిమెంట్‌ మ్యాన్‌ హోల్‌

రాజమహేంద్రవరం సిటీ: రైల్వే శాఖలో ఇన్‌స్పెక్టర్‌ ఆఫ్‌ వర్క్స్‌ అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా ప్రధాన రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌ ఆవరణలోని ఐఆర్‌సీటీసీ ఫుడ్‌ ప్లాజా ఎదురుగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. స్టేషన్‌ ఆవరణలోని మ్యాన్‌హోల్‌, దానిపై మూతను ఐరన్‌తో ఏర్పాటు చేయాలి. కానీ సిమెంట్‌తో వాటి నిర్మాణం చేపట్టడం వలన తరచూ విరిగిపోతున్నాయి. రాత్రి సమయంలో ప్రయాణికులు దీనిలో పడి గాయాలపాలై ప్రమాదం కూడా ఉంది. అలాగే తరచూ మ్యాన్‌హోల్‌ దెబ్బతినడం వల్ల రైల్వే స్టేషన్‌ ఆవరణంతా దుర్గంధంతో నిండిపోతోంది. స్టేషన్‌ మేనేజర్‌, స్టేషన్‌ సీటీఐ కార్యాలయాలు, వెయిటింగ్‌ రూమ్‌లలో ప్రయాణికులు తీవ్ర తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వేల మంది రాకపోకలు సాగించే రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ముందస్తు ఆలోచనలతో చర్యలు చేపట్టాలి. అయితే అధికారులు నిర్లక్ష్యం, అవగాహనా లోపంతో ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నిర్మాణాత్మక చర్యలు చేపట్టాల్సిన అధికారులు తూతూ మంత్రంగా పనులు నిర్వహించడంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు.

ఈవీఎం యూనిట్లకు పటిష్ట భద్రత

- కేంద్ర సాయుధ బలగాల పహారా
- రిటర్నింగ్‌ అధికారి, కలెక్టర్‌ మాధవీలత
- నన్నయలో స్ట్రాంగ్‌రూమ్‌ల పరిశీలన



స్ట్రాంగ్‌ రూమ్‌ల వద్ద భద్రతను పర్యవేక్షిస్తున్న జిల్లా రిటర్నింగ్‌ అధికారి మాధవీలత తదితరులు

రాజానగరం: జిల్లాలోని ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎం యూనిట్లను గట్టి బందోబస్తు నడుమ భద్రపరిచామని జిల్లా కలెక్టర్‌, రిటర్నింగ్‌ అధికారి కె.మాధవీలత తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలోని స్ట్రాంగ్‌ రూములలో భద్రపరచిన ఈవీఎం యూనిట్లను గురువారం పరిశీలించారు. వీటిని భద్రపరిచే క్రమంలో ఎన్నికల కమిషన్‌ జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించామన్నారు. స్ట్రాంగ్‌ రూమ్‌ల వద్ద సాయుధ బలగాలు మూడు షిఫ్టులలో పహారా కాస్తున్నాయని, గెజిట్‌ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తుంటారన్నారు. స్ట్రాంగ్‌ రూమ్‌లలో విద్యుత్‌ షాట్‌ సర్క్యూట్‌కు అవకాశం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. కౌంటింగ్‌ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ ప్రాంతానికి ఒక కిలోమీటర్‌ దూరంలో విధులు నిర్వర్తించే అధికారులు మినహా, ఇతరులెవ్వరూ గుంపులుగా ఉండటం, సమావేశాలు నిర్వహించడం నిషిద్ధమన్నారు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మూడంచెల భద్రత

నన్నయ వర్సిటీలోని స్ట్రాంగ్‌ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ పి.జగదీష్‌ తెలిపారు. డీఎస్పీ, సీఐ, మొబైల్‌ టీమ్‌, సీఆర్‌పీఎఫ్‌, ఆర్మ్‌ రిజర్వు ఫోర్సెస్‌, రాష్ట్ర పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే 144 సెక్షన్‌ కూడా అమలులో ఉంటుందన్నారు. ఆమె వెంట అసెంబ్లీ రిటర్నింగ్‌ అధికారులు ఎస్‌.తేజ్‌ భరత్‌, కె.దినేష్‌ కుమార్‌, అశుతోష్‌ శ్రీవాత్సవ్‌, ఎ.చైత్రవర్షిణి, ఎం.మాధురి, ఆర్‌వీ రమణ నాయక్‌, ఎల్‌.శివజ్యోతి, అదనపు ఎస్పీలు ఎల్‌.చెంచిరెడ్డి, ఆర్‌.కృష్ణ నాయక్‌, కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

బ్లూటీఫుల్‌


నీలిరంగులో ఆకట్టుకున్న ఆకాశం

రాజానగరం: ప్రకృతిలో ప్రతిబింబించే అందచందాలకు కొదవే ఉండదు. చిత్రకారుడి కుంచెకు కూడా అందని ఎన్నో అందాలను ప్రకృతి చూపిస్తుంటుంది. సాధారణంగా సాయంత్రం సంధ్య వేళలో ఆకాశం ఎర్రటి కుంకుమ ఛాయలో ఉంటుంది. అయితే గురువారం సాయంత్రం రాజానగరంలో వాతావరణం చల్లబడి, మేఘాలు కమ్ముకోవడంతో వరుణ కాంతులతో కనిపించాల్సిన ఆకాశం.. కారుమబ్బులతో నీలిరంగులో దర్శనమిచ్చింది. రాజానగరం నుంచి ఫరిజల్లిపేట వైపు వెళ్లే ప్రాంతంలో కనిపించిన ఈ దృశ్యం ఆకట్టుకుంది.

విశ్రాంత చీఫ్‌ ఇంజినీర్‌ శ్రీరామచంద్రరావు మృతి

తెనాలి: ధవళేశ్వరం విశ్రాంత చీఫ్‌ ఇంజినీర్‌ చుండూరి శ్రీరామచంద్రరావు (92) గురువారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని తన నివాసంలో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. శ్రీరామచంద్రరావు స్వస్థలం మచిలీపట్నం. తొలుత మచిలీపట్నం, గుడివాడలో పీడబ్ల్యూడీలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అనంతరం జలవనరుల శాఖలో ఒంగోలులోని నాగార్జున సాగర్‌ కాల్వలు వంటి వివిధ ప్రాజెక్టుల్లో పనిచేశారు. ఖమ్మంలో ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ విధులు నిర్వర్తించారు. సూపరింటెండెంట్‌ ఇంజినీర్‌గా విజయవాడలో సుదీర్ఘకాలం పనిచేశారు. అనంతరం ధవళేశ్వరం ప్రాజెక్టుకు చీఫ్‌ ఇంజినీర్‌గా పనిచేస్తూ 1990లో రిటైరయ్యారు. అంతకుముందు సీలేరు ప్రాజెక్టులో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలోని ఆయకట్టులో పంటల సాగుకు దోహదపడ్డారు. తెలుగు గంగ స్పెషలాఫీర్‌ శ్రీరామకృష్ణయ్యతోనూ కలిసి ఆ ప్రాజెక్టులో పనిచేశారు. శ్రీరామచంద్రరావులోని చిత్తశుద్ధి, నిజాయితీని దృష్టిలో ఉంచుకుని నాటి సీఎం ఎన్టీ రామారావు తెలుగు గంగ ప్రాజెక్టుకు ఎంపిక చేశారు. హైదరాబాద్‌లోని విష్పర్‌ వాలీలో ప్రముఖ చార్టర్డ్‌ అకౌంటెంట్‌ అయిన కుమారుడు సీవీ కోటేశ్వరరావు నివాసంలో ఉంటూ అక్కడే మృతి చెందారు.

వైఎస్సార్‌ సీపీ నుంచి కాపవరం సర్పంచ్‌ సస్పెన్షన్‌

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం పంచాయతీ సర్పంచ్‌, వైఎస్సార్‌ సీపీ సభ్యుడు జాజుల రామును పార్టీ నుంచి సస్పెండ్‌ చేసినట్టు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. ఆయన గురువారం విలేకరుతో మాట్లాడుతూ జాజుల రాము పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా, విధానాలకు విరుద్ధంగా పని చేసినందుకు ఈ చర్య తీసుకున్నామన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రాము వ్యవహరించిన తీరుపై పలు ఫిర్యాదులు అందాయన్నారు. పార్టీ కార్యకలాపాలకు విరుద్ధంగా ఆయన వ్యవహరించినట్టు నిర్ధారణ కావడంతో సస్పెండ్‌ చేశామన్నారు.

వైభవంగా శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

దేవరపల్లి: శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ద్వితీయ వార్షిక బ్రహోత్సవాలు దేవరపల్లిలో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. బ్రహోత్సవాల సందర్భంగా శ్రీవారు వివిధ రకాల సుగంధ పుష్పాలతో విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం శ్రీవారి శోభాయాత్ర, సేనాధిపతి విష్వక్సేన తిరువీధి ఉత్సవం, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, దీక్షాధారణ, అంకురారోహణ, ధ్వజపటవాస్తు పూజ, మంగళాశాసనం కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్‌ అంబటి శ్రీనివాస్‌ దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. బ్రహోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. ఈ ఉత్సవాలు ఈ నెల 19వ తేదీ వరకు జరుగుతాయి. 18న సాయంత్రం 7 గంటల నుంచి శ్రీనివాస కల్యాణ మహోత్సవం జరుగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. 19న ఉదయం 11 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసమారాధన జరుగుతుంది.

మండలాభివృద్ధికి కలిసికట్టుగా పని చేయాలి

మండల పరిషత్‌ సర్వ సభ్య సమావేశంలో ఎంపీపీ కేతా తులసి


పెదపూడి మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కేతా తులసి

పెదపూడి: మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలని ఎంపీపీ కేతా తులసి అన్నారు. స్థానిక మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కేతా తులసి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు సమస్యల పరిష్కారానికి చిత్త శుద్ధితో కృషి చేయాలన్నారు. విధుల్లో బాధ్యత రాహిత్యంగా వ్యవహరించే వారిపై నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులపై సమాచారాన్ని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులకు కచ్చితంగా తెలియజేయాలన్నారు. ముందుగా వ్యవసాయ, విద్యాశాఖ, పశువైద్యం తదితర శాఖల ప్రగతిని సంబంధిత అధికారులు వివరించారు. పంట కాలువలు పూడుకుపోయి సాగునీరు దిగువ ప్రాంతాలకు సక్రమంగా ప్రవహించడం లేదని, వాటిని ఎందుకు బాగు చేయించడం లేదంటూ పుట్టకొండ సర్పంచ్‌ వల్లు వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల వెంకటరమణ ఇరిగేషన్‌ అధికారులను నిలదీశారు. అలాగే చింతపల్లి లాక్‌ వద్ద గోడ కూలిపోయిందని దానిపై తక్షణం అవసరమైన చర్యలు చేపట్టి సాగునీరు దిగువ ప్రాంతాలకు వచ్చేలా కృషి చేయాలని కోరారు. దానిపై ఇరిగేషన్‌, డ్రైనేజీ అసిస్టెంట్‌ ఇంజినీర్లు సుబ్రహ్మణ్యం, క్రాంతిలు సమాధానమిస్తూ మండలంలో 10 కాలువల ఆధునీకరణ పనులకు మంజూరు లభించిందని త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. చింతపల్లి లాక్‌ కాలువ వద్ద గోడకు ప్రతిపాదనలు పంపించామని మంజూరు కావాల్సి ఉందన్నారు. ఎస్‌ఐ శోభన్‌కుమార్‌ మాట్లాడుతూ గత 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలు మండలంలో ప్రశాంతంగా జరిగాయన్నారు. అయితే జూన్‌ 6వ తేదీ వరకూ ఎన్నికల కోడ్‌ అమలులో ఉన్నందున ప్రజాప్రతినిధులు, అధికారులు కోడ్‌కు లోబడి ఉండాలన్నారు. కోడ్‌ ఉల్లంఘించే వారిపై నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెద్దాడ, సంపర పీహెచ్‌సీ వైద్యులు ప్రత్యూష, శిరీష వైద్యశాఖ ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, ఎంపీటీసీ సభ్యులు సమ్మంగి దుర్గాప్రసాద్‌, కర్రి శ్రీవెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

సీతానగరం: ఇళ్ల వద్ద నీటి నిల్వలు లేకుండా చూడాలని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్‌ ఏవీకే చైతన్య సూచించారు. ప్రపంచ డెంగీ దినోత్సవం సందర్భంగా గురువారం సీతానగరం పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి, స్థానిక ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే చినకొండేపూడి సచివాలయంలో పీహెచ్‌సీ డాక్టర్‌ ఎస్‌.రాజు ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఆయా కార్యక్రమాలలో వారు మాట్లాడుతూ ఈడిస్‌ దోమ వలన ప్రాణాంతకమైన డెంగీ వ్యాప్తి చెందుతుందన్నారు. గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్లి వ్యాధిపై అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్లాస్టిక్‌ సీసాలు, చిప్పలు, డ్రమ్ములలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. డెంగీ సోకితే జ్వరంతో పాటు తలనొప్పి తీవ్రంగా ఉంటుందని, రక్తంలో ప్లేట్‌లెట్లు తగ్గిపోయి, రోగి ప్రాణాలకు ముప్పు ఏర్పడవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో వైఎస్‌ రాయుడు, ఎంపీహెచ్‌ఎస్‌ కె.సుధాకర్‌, హెల్త్‌ అసిస్టెంట్‌ నందీశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీలు సౌజన్య, జి.స్వరూప, ఏఎన్‌ఎమ్‌లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్‌ అంతరాయం

సీతానగరం: చినకొండేపూడి, సీతానగరం, సింగవరం పంచాయతీ పరిధిలోని నాగరత్నం కాలనీలకు శుక్ర, శనివారాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తామని ఏఈ చంద్రమోహన్‌ తెలిపారు. చినకొండేపూడి విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌ నుంచి వెళ్లే లైన్ల మరమ్మతుల కోసం సరఫరాను ఆపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సినిమాలు



శ్యామల	ఆ ఒక్కటీ అడక్కు
సూర్యమినీ	కింగ్‌డమ్‌ ఆఫ్‌ ప్లానెట్‌ ఆఫ్‌ దిఏప్స్‌
సూర్యప్యాలస్‌	అపరిచితుడు
స్వామి	కృష్ణమ్మ
శివజ్యోతి	గీతాంజలి మళ్ళీ వచ్చింది
అనుశ్రీ	ది గ్యారీఫీల్డ్‌ మూవీ
రాజా	రత్నం
ఊర్వశి	బాక్‌
రంభ	మిరల్‌
మేనక	నటరత్నాలు, ప్రసన్నవదనం
అప్సర	కింగ్‌డమ్‌ ఆఫ్‌ ప్లానెట్‌ ఆఫ్‌ దిఏప్స్‌
కుమారి	దర్శిని, రత్నం
నామవరం	
వీఎస్‌ మహల్‌	కృష్ణమ్మ
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	అపరిచితుడు, కింగ్‌డమ్‌ ఆఫ్‌ ప్లానెట్‌ ఆఫ్‌ దిఏప్స్‌
కడియం	
వెంకటసూర్య	ఆ ఒక్కటీ అడక్కు

బిందు సేద్యం.. లాభాల మార్గం

- ఉద్యానవనాలకు అనుకూలం
- సాగు ఖర్చులు తగ్గడంతో పాటు తెగుళ్ల నియంత్రణ

మధురపూడి: పంటలు సక్రమంగా పండాలంటే సాగునీరు చాలా అవసరం. దానిని ఎంత పొదుపుగా వినియోగించుకుంటే అంత లాభం ఉంటుంది. ఉద్యానవన సాగులో నీటిని పొదుపుగా వాడుకోవడానికి అవకాశం ఉంది. ముఖ్యంగా బిందుసేద్యం ద్వారా నీటిని పొదుపు చేయవచ్చు. మొక్కలకు అవసరమైనంత నీరు అందించి, నీటి వృథాను అరికట్టవచ్చు. మొక్క వేరువ్యవస్థకు నేరుగా నీరందించే పద్ధతినే బిందు, తుంపర సేద్యం అంటారు. రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లో 9,100 హెక్టార్ల విస్తీర్ణంలో ఉద్యానవనాలు ఉన్నాయి. వీటిలో కొబ్బరి, మామిడి, జీడిమామిడి, పనస, బత్తాయి, నిమ్మ, జామ, బొప్పాయి, పామాయిలు తోటలున్నాయి.

లాభదాయకం

బిందు, తుంపర సేద్యం ద్వారా ఖర్చుబాగా తగ్గుతుంది. కలుపు మొక్కల పెరుగుదలను నిరోధిస్తుంది. కలుపు పెరగకపోవడం వల్ల మొక్కకు మరింత పోషణ అందుతుంది. సాగునీరు వృథా కాకుండా, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలను పొందవచ్చు. నీటి కొరత కలిగిన ప్రాంతాల్లో ఈ విధానం చాలా బాగుంటుంది. నియోజకవర్గంలో కొబ్బరి, పామాయిల్‌, నిమ్మ, బత్తాయి, కోకో, మామిడి, జీడిమామిడి, పనస, సపోటా, జామ, నేరేడు, బొప్పాయి తదితర తోటలు ఎక్కువగా


నిడిగట్లలో బిందుసేద్యం విధానంలో సాగవుతున్న తోట


బూరుగుపూడిలోని పామాయిల్‌ తోటలో బిందుసేద్యం పరికరాలు

ఉన్నాయి. కోరుకొండ మండలం మధురపూడి, బూరుగుపూడి, దోసకాయలపల్లి, నిడిగట్ల, కోటికేశవరం, బొల్లెద్దుపాలెం, కణుపూరు, గాదరాడ, నందరాడ, నరేంద్రపురం గ్రామాల్లో పండ్ల తోటలున్నాయి. కోరుకొండ మండలంలో 3,300, రాజానగరంలో 5,400, సీతానగరంలో 400 హెక్టార్లలో ఇవి విస్తరించాయి.

సాగు ఖర్చుల నియంత్రణ

బిందు సేద్యం రైతులకు చాలా ఉపయోగంగా ఉంటుంది. నీటి వినియోగం తక్కువగా ఉండడం వల్ల ఖర్చు కూడా తక్కువగా అవుతుంది. మొక్కల వేర్లకు మాత్రమే నీరు సరఫరా అవ్వడం వల్ల మిగిలిన ప్రాంతాలలో కలుపు మొక్కలు చనిపోతాయి. ప్రత్యేకించి కలుపు మొక్కలను తొలగించాల్సిన అవసరం ఉండదు. అలాగే మొక్కలకు నీరు సక్రమంగా అంది, దిగుబడి బాగుంటుంది. ప్రధానంగా సాగు ఖర్చులను తగ్గించుకోవడానికి ఉపయోగపడుతుంది.

రాయితీలతో విస్తరణ



పండ్లతోటల విస్తరణలో భాగంగా రైతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం రాయితీలను అందిస్తోంది. ఐదేకరాలలోపు పండ్ల తోటలున్న రైతులకు 90 శాతం, ఐదెకరాలకు మించి తోటలున్న వారికి 50 శాతం రాయితీ ఇస్తోంది. జిల్లాలో 2023–24 సంవత్సరానికి గాను 2,200 హెక్టార్ల విస్తరణలో బిందు, తుంపర సేద్యం జరుగుతోంది.

– రిని, ఉద్యానవనశాఖాధికారి, కోరుకొండ

ఎన్నో ప్రయోజనాలు



బిందు, తుంపర సేద్యంతో ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. ముఖ్యంగా ఉద్యానవన తోటలకు అనుకూలంగా ఉంటుంది. అవసరమైన మేరకే నీటి వాడడం వల్ల ఖర్చు బాగా తగ్గుతుంది. రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. ప్రభుత్వ ప్రోత్సాహకాలను వినియోగించుకుని రైతులు బిందు సేద్యంపై దృష్టి సారించాలి.

– కంటే వినయ్‌తేజ, వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు